పోరాట యోధుడు సర్దార్ పాపన్న గౌడ్

- మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- మీర్‌పేట్ చందనం చెరువు కట్ట మీద ఘనంగా జయంతి
- పలు చోట్ల వైభవంగా నిమ్న వర్గాల నిరుపమాన ధీరుడి జయంత్యుత్సవాలు

సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, చిత్రంలో పాపన్న గౌడ్ అభిమానులు, పలువురు నేతలు

బడంగ్‌పేట్, ఆగస్టు 18: సామాన్య ప్రజల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ధీరుడు సర్దార్ పాపన్న గౌడ్ అని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ చందనం చెరువు కట్ట మీద సర్దార్ పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాపన్న గౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ నిజాంపై జరిగిన తెలంగాణ తిరుగుబాటులో కీలక పాత్ర పోషించి సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడారని తెలిపారు.

ధీరత్వానికి ప్రతీక సర్దార్

ఆర్కేపురం: తెలంగాణ ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమానికి దేప భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేదలను సంఘటితం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో మహేందర్ యాదవ్, నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్, కందికంటి శ్రీధర్ గౌడ్, రాజుగౌడ్, జంగారెడ్డి, విజయ్, కళ్యాణ్ యాదవ్, నబీ కుమార్, సాయి తదితరులు ఉన్నారు.

ముద్దగౌని ఆధ్వర్యంలో..

వనస్థలిపురం: పాపన్న స్ఫూర్తితో రాజ్యాధికారం సాధించే దిశగా ప్రతి ఒక్కరు శ్రమించాలని మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న అన్నారు. సాహెబ్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంత్యుత్సవాలకు ఆమె హాజరై మాట్లాడారు. ధైర్యంగా పోరాడితే రాజ్యాలను జయించవచ్చని పాపన్న చేసి చూపించారన్నారు. బడుగు బలహీన వర్గాలు ఆయన చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. అనంతరం, పాపన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్త మహేశ్ గౌడ్, నీళ్ల అశోక్ గౌడ్, మహేశ్ గౌడ్, పల్లె కృష్ణ, నాగరాజు, శ్రీకాంత్, కొండయ్య, యాదగిరి, రవీందర్, విజయప్రకాష్, దామోదర్ పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి, పలువురు నేతలు, స్థానిక ప్రజలు

సర్వాయి పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముద్దగౌని లక్ష్మీప్రసన్న తదితరులు

ఎల్బీనగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, ఉత్సవాల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల మల్లేశ్ గౌడ్

బడుగుల ఆశాజ్యోతి 'సర్దార్'

మన్సూరాబాద్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ అన్నారు. ఎల్బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఉత్సవాల కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల మల్లేశ్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంత్యుత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొత్త రవీందర్ గౌడ్, అంతటి వీరస్వామి గౌడ్, పల్లె గణేశ్ గౌడ్, కొత్త వెంకటేశ్ గౌడ్, బోడా వెంకటరమణ గౌడ్ పాల్గొన్నారు.

24న మలక్‌పేటలో మెగా జాబ్ మేళా

సైదాబాద్, ఆగస్టు 18: పాతబస్తీలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించటమే లక్ష్యంగా ఈ నెల 24న శనివారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. మెగా జాబ్ మేళాలో 60కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, వీటిలో ఐటీ సెక్టార్‌కు సంబంధించిన కంపెనీలతో పాటు, ఫార్మా, హెల్త్‌కేర్, ఆటోమొబైల్, బీపీవో వంటి అనేక కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. జావా, డాట్‌నెట్, పైథాన్, డేటా ఎంట్రీ, కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్, టెలీకాలర్స్, నర్సింగ్, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్ వంటి అనేక రంగాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ జాబ్‌మేళాకు 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బీఎస్సీ, పీజీ, డిప్లమా, బీ టెక్, ఎం.టెక్ చదివిన వారంతా తమ పేర్లను క్యూఆర్ కోడ్ స్కానర్‌ను స్కాన్ చేసి తమ వివరాలను నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలన్నారు. చాదర్‌ఘాట్ నయాగారా హోటల్ సమీపంలోని ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించే జాబ్‌మేళాను ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ప్రత్యంగిరా దేవికి లక్ష గాజుల పూజ సేవ

ఆర్కేపురం, ఆగస్టు 18: ఆర్కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవార్లకు శ్రావణ పౌర్ణమి సందర్భంగా నేడు (సోమవారం) ఉదయం తొమ్మిది గంటలకు లక్ష గాజుల పూజ సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

జిల్లా స్పోక్స్ పర్సన్‌గా ఇస్తియాక్ గుల్షన్

మొహ్మద్ ఇస్తియాక్ గుల్షన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

ఆర్కేపురం, ఆగస్టు 18: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా స్పోక్స్ పర్సన్‌గా మొహ్మద్ ఇస్తియాక్ గుల్షన్ నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మొహ్మద్ ఇస్తియాక్ గుల్షన్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన మీద నమ్మకంతో తనకు అప్పగించిన ఈ పదవికి తగిన న్యాయం చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, వక్కలంక శ్రీనివాస్‌రావు, మతిన్ షరీఫ్, చిక్కుళ్ళ శివప్రసాద్, శంకర్ యాదవ్, మహేందర్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు

మియాపూర్, ఆగస్టు 18 : కామాక్షి బ్రాహ్మణ సంఘం నిజాంపేట శాఖ ఆధ్వర్యంలో 32 మంది నిరుపేద బ్రాహ్మణ విద్యార్థులకు రూ. 6 లక్షల ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేశారు. హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులోని సంఘ ం కార్యాలయంలో పలువురు దాతల తోడ్పాటుతో ఉపకార వేతనాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు రాళ్లపల్లి కరుణాకర్, చుండూరు విజయసారథి, సుధాకర్, పారానంది శంకర్, భువనేశ్వరి, రమణి, రామారావు, పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలింగ్

కాప్రా, ఆగస్టు 18: రాష్ట్ర పద్మశాలిసం ఘం అధ్యక్ష పదవికి ఆదివారం ప్రశాంతం గా పోలింగ్ జరిగింది. అధ్యక్షపదవి కోసం సిద్దిపేటకు చెందిన బూర మల్లేశం, మల్కాజిగిరికి చెందిన వల్లకాటి రాజ్‌కుమార్ పోటీ పడుతున్నారు. మల్కాజిగిరి, కాప్రా ప్రాం తాల్లో నివసించే పద్మశాలీలకు సంబంధించిన పోలింగ్ కేంద్రం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని మార్కండేయనగర్‌లోని కాప్రా పద్మశాలి సంఘం భవనంలో ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా సాయంత్రం 4 గంటలవరకు పోలింగ్ సాగింది. కౌంటింగ్ సోమవారం జరుగనుంది. పోటాపోటీగా జరిగిన ఈ ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

గిరిజన సంస్కృతిని చాటి చెప్పేదే తీజ్ పండుగ

తీజ్ పండుగ ఉత్సవంలో పాల్గొన్న మురుకుంట్ల అరవింద్ శర్మ, తదితరులు

ఆర్కేపురం, ఆగస్టు 18: గిరిజన సంస్కృతిని చాటి చెప్పేది తీజ్ పండుగ అని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ బంజారా బస్తీలో గుడి పూజారి బాలు నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరువు నుంచి కాపాడే ప్రకృతి పండుగ తీజ్ అన్నారు. తీజ్‌ను ఎనిమిది రోజుల పాటు పూజించి తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారని చెప్పారు. బతుకమ్మను పూజలతో అలంకరించినట్లే తీజ్‌లో గోధుమ మొలకలను పూజించడం లంబాడీల ఆనవాయితీ అని పేర్కొన్నారు. బంజారాల సంస్కృతికి దర్పణం ఈ తీజ్ ఉత్సవం అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీమన్నారాయణ, జాహెద్, కృష్ణానాయక్, దశరథనాయక్, శ్రీనునాయక్, శుక్రు నాయక్, దస్రు నాయక్, రవి నాయక్, కవిత, లక్ష్మి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది ప్రతినిధులు

కాప్రా, ఆగస్టు 18:ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేసే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు ఉద్యోగులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఏఎస్‌రావునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆరోగ్యశ్రీ ఉద్యోగుల ప్రతినిధులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ సిబ్బంది ఈశ్వరి భాయ్, హరిబాబు, సుమన్, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఘనంగా బాబా విగ్రహ ప్రతిష్ఠాపన

ఉప్పల్, ఆగస్టు 18:హబ్సిగూడ రవీంద్రనగర్‌లో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాలనీలోని సంతోషిమాత సాయిబాబా మందిరంలో పడుకున్న సాయిబాబా విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం చేపట్టారు. ఈమేరకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేదపండితులచే పూజా కార్యక్రమాలు, హోమం చేపట్టారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాబా దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కాంతారెడ్డి తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. అన్నప్రసాద వితరణనిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య

హస్తినాపురంలో బీసీ పోరు దీక్షలో మాట్లాడుతున్న ముద్దగౌని సతీశ్ కుమార్ గౌడ్

వనస్థలిపురం, ఆగస్టు 18: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దగౌని సతీశ్ కుమార్ గౌడ్ అన్నారు. హస్తినాపురం చౌరస్తాలో కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆదివారం నిర్వహించిన బీసీల పోరు దీక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన విధంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ జనగణన కార్యక్రమాన్ని కూడా వెంటనే ప్రారంభించి లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలంపల్లి రామకోటి, అనంతుల రామ్మూర్తి, రాజారామ్ యాదవ్, వేణు కుమార్, బొమ్మ రఘురాం నేత, సిద్ధేశ్వర్, రామనర్సింహ గౌడ్, నరహరి, ప్రసాద్, మహేశ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీరామ భక్త హనుమాన్

శ్రీరామ భక్త భనుమాన్ పౌరాణిక పద్య నాటికలో ఓ సన్నివేశం

వనస్థలిపురం, ఆగస్టు 18: శ్రీరామ భక్త హనుమాన్ పౌరాణిక పద్యనాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. నటుల అభినయం, హావభావాలు మంత్రముగ్ధులను చేశాయి. రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న పౌరాణిక పద్య నాటిక పోటీల్లో ఆ ప్రదర్శన నిర్వహించారు. ఎన్జీవోస్ కాలనీలోని చంద్రకళా వేదికపై ప్రదర్శనలు జరుగుతున్నాయి. రెండో నాటికగా శ్రీకృష్ణాంజనేయ యుద్ధం నాటకాన్ని ప్రదర్శించారు. ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరై పోటీలను తిలకించారు. కార్యక్రమంలో జడ్జి కృష్ణమూర్తి, పంపన వెంకటేశ్వరరావు, సోమయాజులు, సూర్యనారాయణ, అచ్యుతరామయ్య, పుండరీకాక్షుడు, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు సీజ్

మల్కాజిగిరి, ఆగస్టు 18: అక్రమ నిర్మాణాలను సర్కిల్ అధికారులు సీజ్ చేస్తున్నారు. ఆదివారం అల్వాల్ సర్కిల్ ఓల్డ్ అల్వాల్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను గుర్తించి సీజ్ చేశారు. గత కొన్ని రోజులుగా సర్కిల్ పరిధిలో దాదాపు నాలుగు అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు. ఇప్పటికే అక్రమంగా నిర్మించిన భవనాలకు నోటీసులు జారీ చేశారు. భవనాలకు సం బంధించిన అనుమతులను పరిశీలించడానికి పత్రాలను సిద్ధంగా ఉంచాలని అధికారులు అప్పటికే యజమానులను కోరారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

- ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 21న ఆందోళన: మన మాలల సొసైటీ

ఎల్బీనగర్, ఆగస్టు 18: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 21న నిర్వహించ తలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని మన మాలల సొసైటీ రాష్ట్ర నాయకులు కడారి పెంటయ్య, పార్శపు శ్రీధర్, రాసమల్ల శ్రీనివాస్, కంఠం శ్రీనివాస్, మురళీధర్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీలను విడగొట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు కొందరు రాజకీయ నాయకులు కుట్రలు పన్నుతున్నారని వారు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాజ్యాంగబద్ధంగా పార్లమెంటులో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే విధంగా సుప్రీం కోర్టు తీర్పును ఆసరాగా చేసుకుని అమలు చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. రాజకీయ పార్టీల నాయకులు తమ పబ్బం గడుపుకునేం దుకే ఎస్సీల మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టారని వారు విమర్శించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంతో పాటుగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని ప్రతి బస్తీ, కాలనీల్లోని మాలలంతా ఆగస్టు 21వ తేదీన తమ విధిగా భారత్ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

గోల్డ్ మెడల్ సాధించిన చెన్న అక్షయ

కరాటే, తైక్వాండో, కుంపు పోటీల్లో నగరవాసికి గోల్డ్ మెడల్

హయత్‌నగర్, ఆగస్టు 18: కరాటే తైక్వాండో, కుంపు నేషనల్ పోటీల్లో హయత్‌నగర్‌కు చెందిన చెన్న అక్షయ గోల్డ్ మెడల్ సాధించినట్లు వారియర్ కరాటే ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ పగిళ్ల శ్రీశైలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో చిన్నారులు, మహిళలకు ఆత్మరక్షణ కోసం కరాటే తైక్వాండో, కుంపు విద్యలు నేర్చుకోవాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన నేషనల్ కరాటే పోటీల్లో అక్షయకు ప్రథమ బహుమతి సాధించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు పీవీ శ్రీరాములు, గణేష్, రాము, అంజి, రాజు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను మర్యాద పూర్వకంగా కలిసి ఆలయానికి ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్, నల్ల రఘుమారెడ్డి, ఈవో లావణ్య

ధ్యానాంజనేయ ఆలయ సందర్శనకు మంత్రి కొండాకు ఆహ్వానం

చంపాపేట, ఆగస్టు 18: చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లో ఎంతో ప్రసిద్ధి గాంచిన ధ్యానాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించాలని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి లావణ్య ధర్మకర్తల బృందం ఆదివారం రాష్ట్ర అటవీ శాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి స్వామివారి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాలు అందజేసి, పలువురి దాతల సహకారంతో దిన, దిన అభివృద్ధి చెందుతున్న ధ్యానాంజనే స్వామి ఆలయాన్ని సందర్శించాలని మంత్రిని కోరినట్లు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి తెలిపారు. ఇదే విధంగా ఆలయంలో చేపట్టిన పలు నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా సోమవారం వాటిని ప్రారంభించేందుకు ఆలయానికి రావాల్సిందిగా మంత్రికి ఆహ్వానం పలికినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

మాక్సి విజన్ ఫ్రీ మెడికల్ క్యాంప్

విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆర్కేపురం, ఆగస్టు 18: సామాజిక వేత్త పాటూరు వెంకటేశ్వర్లు సహకారంతో మాక్సి విజన్ హాస్పిటల్స్ యాజమాన్యం, సీనియర్ డా.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఫ్రీ మెడికల్ ఐ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహంలోని 115 మంది విద్యార్థులకు కళ్లను పూర్తిగా స్కానింగ్ చేసి, చెకప్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అనాథ విద్యార్థులను అక్కున చేర్చుకొని, వసతితో పాటు భోజనం, విద్యా సౌకర్యాలు కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు మార్గం రాజేశ్ కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనాథ విద్యార్థులకు తమ వంతు సహాయంగా విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన విద్యార్థులకు కళ్ళద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గృహ అధ్యక్షులు మార్గం రాజేశ్, మహేందర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో పోలీస్ పాత్ర చాలా కీలకం

సిబ్బందితో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి

ఉప్పల్, ఆగస్టు 18: విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తూ, ప్రజల విశ్వాసం పొందాలని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి అన్నారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బందికి ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, ఉప్పల్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐ, ఉప్పల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ హాజరైనారు. కార్యక్రమంలో ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.